


ఉచిత న్యాయాన్ని పొందండి
జిల్లా జడ్జి శ్రీనివాస నాయక్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి సబ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉండి వ్యక్తులు ఆర్థిక స్తోమత లేకుంటే ఉచిత న్యాయం పొందవచ్చని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస నాయక్ సూచించారు. స్థానిక సబ్ జైలును శనివారం న్యాయమూర్తి సందర్శించారు. జైలు పరిసరాలను పరిశీలించారు. అనంతరం రిమాండ్ ఖైదీలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రిమాండ్ ఖైదీలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు.

మాటల్లేవ్... మాట్లాడుకోటాల్లేవ్...!



పూర్తిగా అటకెక్కిన 'టాస్క్‌ఫోర్స్' సమావేశాలు
ప్రభుత్వం, టిటిడి మధ్య సమన్వయ లోపం
తొమ్మిది రోడ్ల అభివృద్ధి పట్టించుకోని వైనం
సమస్యల సుడిగుండంలో తిరుపతి నగరం

'కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయి'.. అయితే టిటిడి, ప్రభుత్వ యంత్రాంగం తిరుపతి అభివృద్ధిపై మాటల్లేవ్... మాట్లాడుకోటాల్లేవ్.. తిరుమల తిరుపతిని విడదీయలేం.. అంతటి అవినాభావ సంబంధం ఉంది.. అయితే 25 ఏళ్ల క్రితం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 'టాస్క్‌ఫోర్స్' కమిటీని ప్రారంభించారు.. ఈ కమిటీకి టిటిడి ఈవో 'పెద్దన్న' పాత్ర పోషిస్తారు.. తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి యంత్రాంగం ఇందులో సభ్యులుగా ఉంటారు.. ఈ కమిటీ నిర్ణయాల ద్వారా సమన్వయంతో తిరుపతి అభివృద్ధి జరిగేది. అయితే గత వైసిపి హయాంలో పూర్తిగా ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీని అటకెక్కించేశారు. కూటమి అధికారంలోకి వచ్చి అర్ధ సంవత్సరం దాటినా ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీని పునరుద్ధరించకపోవడం గమనార్హం.. ఈ కారణంగా ప్రభుత్వం, టిటిడి మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తిరుపతిలో నిర్మించ తలపెట్టిన తొమ్మిది రోడ్ల అభివృద్ధిని పట్టించుకున్న దిక్కులేదు. దీంతో సమస్యల సుడిగుండంలో తిరుపతి నగరం కొట్టుమిట్టాడుతోంది.. ఏదిఏమైనా టాస్క్‌ఫోర్స్ కమిటీని పునరుద్ధరించి, ఒక్కసారి మాట్లాడుకోవడం ప్రారంభిస్తే చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

ఆగిన స్మార్ట్ ప్రాజెక్టు పనులు

కమాండ్ కంట్రోల్ రూమ్	రూ.91 కోట్లు	రూ.12కోట్లు
మల్టీలెవల్ కారు పార్కింగ్	రూ.40 కోట్లు	రూ.7 కోట్లు
కచ్చెప్పి ఆడిటోరియం	రూ.40 కోట్లు	రూ.30 కోట్లు
గొల్లవానిగుంట క్రికెట్ స్టేడియం	రూ.20 కోటుల	రూ.2 కోట్లు

(కార్పొరేషన్ చేతులెత్తేయడంతో శాప్ ఛైర్మన్ రవినాయుడు ముందుకొచ్చారు)


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టాస్క్‌ఫోర్స్ కమిటీలో టిటిడి ఈవో 'పెద్దన్న' పాత్ర పోషిస్తారు. ఇందులో కలెక్టర్, జేసీ, డిఆర్ఒ, ఆర్డీవో, తహశీల్దార్‌తో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఆర్‌టిసి ఆర్ఎం, ట్రాన్స్‌కో, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్, జిల్లా వైద్యాధికారి కమిటీ సభ్యులుగా వ్యవహరించేవారు. తిరుపతి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాల డబ్బులు అంతంతమాత్రంగానే ఉండడంతో ప్రజలపై పన్నుల భారాలు మోపి ముక్కుపిండి వసూలు చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కార్పొరేషన్‌కు బడ్జెట్లో ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో తిరుపతి నగరం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. తిరుపతి స్మార్ట్‌సిటీ పథకంలో కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించింది. నగరంలో 59 ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. నిధుల లేమితో ఈ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. రాష్ట్రం ఇవ్వాల్సిన వాటా దాదాపు 250 కోట్లు గత ఐదేళ్లుగా ఇవ్వలేదు. గత వైసిపి హయాంలో 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేశారు. వీటికి కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నిధులు ఖర్చు చేశారు. కార్పొరేషన్‌లో దాదాపు 50 కోట్ల రూపాయలు బ్యాంకులో డిపాజిట్లు ఉండేవి. మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేసేందుకు నిధులు లేక, ఈ 50 కోట్ల డిపాజిట్‌ను బ్యాంకులో తనఖాపెట్టి అప్పుతెచ్చి రోడ్లు వేశారు. దీంతో పాటు జనరల్ ఫండ్స్‌లో దాదాపు 100 కోట్లు విలువ చేసే పనులకు టెండర్లను పిలిచి కాంట్రాక్టర్లకు ఇచ్చారు. దీంతో కార్పొరేషన్ ఖజానా ఖాళీ అయ్యింది. టిటిడి నుంచి ఆస్తిపన్ను రూపంలో కార్పొరేషన్‌కు 30 కోట్లు రావాల్సి ఉంది. ఈ నిధులివ్వాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య టిటిడి ఈవోకు లేఖ రాశారు. అయితే టిటిడి నుంచి ఎప్పటిలాగే స్పందన లేదు. దీంతో కార్పొరేషన్‌కు ఆదాయం లేక ఆస్తిపన్నులు వంద శాతం వసూలు చేయాలని రెవెన్యూ అధికారులపై ప్రతిరోజూ ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఇప్పటికే పన్నులు 60 శాతం పైగా వసూలయ్యాయి.

మురుగునీటి వ్యవస్థ : తిరుపతి – రేణిగుంట అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగునీటి పైపులైన్ కనెక్షన్ 30 ఏళ్ల క్రితం నిర్మించారు. కాలపరిమితి పూర్తయ్యి మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఆధునిక టెక్నాలజీతో పనులు చేపట్టాలంటే రూ.300 కోట్లు అవసరం. తిరుపతి కార్పొరేషన్ వద్ద నిధుల్లేవు. టిటిడి పట్టించుకోని పరిస్థితి.

అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు : ఎస్‌పిడిసిఎల్ రూ.240 కోట్లతో ప్రపంచబ్యాంకు వద్ద నిధులు తీసుకుని పనులు చేపట్టారు. ఇప్పటివరకూ 70శాతం పనులే పూర్తయ్యాయి.

టాస్క్ ఫోర్స్ సమావేశాలు నిర్వహించండి : టి.సుబ్రమణ్యం, సిపిఎం



తిరుపతి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాలు ప్రతి రెండునెలలకు ఒకసారి జరగాల్సి ఉంది. అయితే గత ఆరేడేళ్లుగా ఆ ఊసేలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాలను నిర్వహిస్తే తిరుపతి అభివృద్ధి జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా టిటిడి ఈవో, కలెక్టర్ చొరవ చూపాలి.



హా(ఆ)ర్ట్... హత్తుకుంది..!
విమెన్ ఆర్ట్‌షో ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీ పద్మావతి చిత్రాలయం ఆధ్వర్యంలో తిరుపతి ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్లో ఏడుగురు మహిళా చిత్రకారుల బృందం ఏర్పాటు చేసిన విమెన్ ఆర్ట్ షో కళాకారుల మనస్సును హత్తుకుంది. శనివారం నగరి ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ విసి దుర్గాభవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ లోకల్ టాలెంట్‌ను మరింత ప్రోత్సహించాలన్నారు. మహిళా చిత్రకారులు వారిలోని సృజనాత్మకతను వెలికితీసి, నైపుణ్యానికి మరింత పదునుపెట్టి ఆకట్టుకునేలా పెయింటింగ్‌లు వేయడం తనను అబ్బురపరచిందన్నారు. సీనియర్ రచయిత డాక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తిరుపతిలో పర్మినెంట్ ఆర్ట్ గ్యాలరీ పెట్టాలన్నారు. తంజావూరు, నిర్మల్, కలంకారీ, మధుబని, స్టీల్ ఆర్ట్ తదితర చిత్ర కళల్లో ప్రతిభ చాటిన మహిళా చిత్రకారులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆధునిక జీవన శైలిలో కూడా మన సంస్కృతిలో భాగమైన చిత్రకళను తర్వాతి తరానికి అందించేందుకు మహిళలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిరణ్‌రాయల్, వేమన విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున, నడ్డినారాయణ, మహిళా చిత్రకారులు కిరణ్‌కుమారి, అర్చన, కోనేరు ఊర్మిళ, గాయత్రీదేవి, ఆర్.శ్రీదేవి, ఎస్.లావణ్య, సాయి, దివ్య పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ఆదివారం సాయంత్రం వరకూ కొనసాగనుంది.

తుడా టవర్స్ నిర్మాణ పనులు పరిశీలన

తిరుపతి టౌన్ : తుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న టవర్స్‌ను శనివారం ఉదయం తుడ ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఫిబ్రవరిలోపు మోడల్‌ప్లాన్, ఎగ్జిబిషన్ స్టాల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తే వేలం నిర్వహించేందుకు వీలుంటుందని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సెక్రటరీ వెంకట నారాయణ, కష్ణా రెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, నిర్మాణ సంస్థ ప్రతినిధి సుశీల్ పాల్గొన్నారు.

ఓటు 'పవర్'ఫుల్.. !

ఓటరులో స్ఫూర్తినింపేలా జాతీయ ఓటరు దినోత్సవం అట్టహాసంగా జిల్లావ్యాప్తంగా ర్యాలీలు... మానవహారాలు.. సభలతో హోరెత్తింది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అవార్డును రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా అందుకున్నారు.



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్


మహిళా వర్సిటీలో...



స్ప్రింగ్‌డేల్ స్కూల్లో...





పాపానాయుడుపేటలో...

ర్యాలీలు...మానవహారాలు...ప్రతిజ్ఞ..!
స్ఫూర్తినింపేలా జాతీయ ఓటర్ దినోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

క్యాంపస్‌లో.. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఇందిరా ప్రియదర్శిని సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని సభ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. ఓటు హక్కు పొందినవారు వందశాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ విజ్ఞప్తి చేశారు. తొలుత ఆర్డీవో కార్యాలయం నుంచి ర్యాలీ యూనివర్సిటీ వరకూ సాగింది. ఆడిటోరియంలో ఇన్‌ఛార్జి విసి ఆచార్య ఉమతో కలిసి జ్యోతి ప్రజ్వలనం చేసి, ఓటర్ల ప్రతిజ్ఞతో ప్రారంభించారు. పాఠశాల, కళాశాలల నుండి వక్తృత్వ, క్విజ్, వ్యాస రచన, డిబేట్ లలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసా పత్రం, మోమెంటోలను అందచేశారు.

- కెవిబిపురంలో.. తహశీల్దార్ మునిరత్నం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

- తిరుపతి సిటీలో... ఎస్‌వి వైద్య కళాశాలలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎ చంద్రశేఖరన్ ప్రారంభించారు. వైద్య విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకుని, ఒత్తిడికి దూరంగా ఉంటూ, సామాజిక సేవలు చేయడానికి, మెరుగైన సమాజాన్ని నిర్మించడానికి ఈ యూనిట్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డిఎస్‌ఎన్‌మూర్తి, డాక్టర్ థెరిస్సారాణి, స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ తుంగ శ్రీకాంత్ పాల్గొన్నారు. జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు జిల్లా ప్రధాన పోలీసులు కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో శనివారం ప్రతిజ్ఞ చేయించారు. అదనపు ఎస్పీలు జె.వెంకట్రావు, కే.రవి మనోహరాచారి పాల్గొన్నారు.

- రామచంద్రాపురంలో... సీనియర్ సిటిజన్లకు తహశీల్దార్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. డిప్యూటీ తహశీల్దార్ ఎం.అన్వర్‌బాషా, విద్యాశాఖ అధికారి మార్కండేయనాయుడు, ఎస్‌ఐ రామాంజనేయులు పాల్గొన్నారు. విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

- బుచ్చినాయుడు కండ్రిగలో.. తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం, ఎంఇఒ రవీంద్రనాథ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ధనంజయులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

- ఏర్పేడులో... తహశీల్దార్ కార్యాలయం నుంచి ఏర్పేడు కూడలి వరకూ తహశీల్దార్ భార్గవి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఎంపీడీఓ సౌభాగ్యం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు నల్లపాలెం శివయ్య, ఆర్ ఐ సుబ్రహ్మణ్యం, ఏర్పేడు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

- పుత్తూరు టౌన్‌లో... : ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటుహక్కు ఎంతో కీలకమని డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సభ జరిగింది. తహశీల్దార్ జిసి వెంకటేశ్వర్లు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు. వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్, గ్రీటింగ్‌కార్డు డిజైన్ అంశాల్లో విజేతలకు రిపబ్లిక్‌డే రోజు బహుమతులను ప్రదానం చేయనున్నారు.

- తిరుపతి (మంగళం)లో.. స్ప్రింగ్ డేల్ పబ్లిక్ పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల యాజమాన్యం నమూనా ఎన్నికలను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఎన్నికల సరళిని కళ్ళకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఆర్. అనురాధ గోపాల్, ఏవో చంద్రశేఖర్, పిఆర్‌ఓ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో.. ఎస్.కే.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో 15వ ఓటర్స్ డే దినోత్సవం ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కే.శివ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు రవి రాజు విద్యార్థులు అందరి చేత ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలోనూ నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించారు. టవర్‌క్లాక్ వద్ద మానవహారం నిర్వహించారు.

- సత్యవేడులో.. ఎస్ఐ రామస్వామి, రెవెన్యూ డిటి వెంకటేశ్వర్, ఎంఇఒలు రవి, ఉష, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాముల్ అరవింద్, దాస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పరంధాం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లు ఎంఎం రవి, వెంకటేశ్వర్, శివప్రసాద్, శైలజ, శ్రీనివాసులును సత్కరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- కోటలో... తహశీల్దార్ కెజెజె రావు ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ తహశీల్దార్ పటాస్ అజంతుల్లాఖాన్, ఆర్ఐ మధులత, శ్రీ ప్రగతి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

- పిచ్చాటూరులో.. జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, బైపాస్ నిర్మాణ కూలీలు కలిసి తహశీల్దార్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. హెడ్మాస్టర్ గిరిప్రకాష్, ఆర్ఐ సుధాకర్, విఆర్‌ఒలు ప్రియాంక, మస్తాన్, రూపేష్ పాల్గొన్నారు.

- వాకాడులో.. ఉత్తమ ఎఇఆర్‌ఒగా వాకాడు తహశీల్దార్ ఎస్.రామయ్య ఎంపికయ్యారు. తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

తెలియని ముద్దాయిలకు జామీను ఇవ్వొద్దు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ముద్దాయిలకు, కోర్టులో తెలియని ముద్దాయిలకు జామీను ఇచ్చి మోసపోవద్దని టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ సూచించారు. గుర్తుతెలియని వారికి ఏదో ఆశించి జామీను ఇచ్చిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు వారు 25వేల రూపాయల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. 2017లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఏ. వెల్లికన్నన్ అనే ముద్దాయికి తిరుపతి జిల్లా ఎర్ర వారి పాలెంకు చెందిన ఎం. గోబ్రి నాయక్, ఎం.శ్రీరాములు నాయక్ జామీను ఇచ్చారన్నారు. అయితే కోర్టు వాయిదాలకు సదరు ముద్దాయిలు హాజరు కాకపోవడంతో ఆర్ఎస్ఎస్ ఏడిజె కోర్టు వారు జామిన్ ఇచ్చిన ఇద్దరికీ జరిమానా విధించిందన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు తెలియని వారికి జామిన్ ఇచ్చి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

శ్రీకాళహస్తి ఎస్ఎఫ్ఐ మహిళా అధ్యక్షురాలుగా ప్రవల్లిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఎస్ఎఫ్ఐ పట్టణ మహిళా అధ్యక్షురాలుగా దాసరి ప్రవల్లిక ఎన్నికయ్యారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా దాసరి ప్రవల్లికను పట్టణ అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానించారు. విద్యార్థులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు శక్తివంచన లేకుండా కషి చేస్తానని దాసరి ప్రవల్లిక తెలిపారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు చుట్టు గురవయ్య, డేవిడ్, మునిలక్ష్మీ, రాధమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


గణతంత్ర కవాతు రిహార్సల్స్
ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆదివారం జరగనున్న గణతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించాలని, పోలీస్ కవాతు అద్భుత రీతిలో ఉండాలనీ జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన రాజు పోలీస్ సిబ్బందికి సూచించారు. శనివారం జరిగిన రిహార్సల్‌లో ఆయన పాల్గొని కవాతు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన రాజు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం సమర్పించారు. అనంతరం పెరేడ్ కమాండర్ గా వ్యవహరించిన ఆర్.ఐ. రాజశేఖర్ రెడ్డి, అతిథికి గౌరవ వందనం సమర్పించి, కవాతు పరిశీలన కొరకు ఆహ్వానించగా, జిల్లా ఎస్పీ పరేడ్ కవాతు పరిశీలన వాహనంలో అధిష్టించి, కవాతులో ఉన్న బలగాలను పరిశీలించారు. అనంతరం డాగ్స్‌స్క్వాడ్ విన్యాసాలు, సాంస్కతిక కార్యక్రమాల రిహార్సల్స్ నిర్వహణ జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిలు, ప్రముఖులు, పాఠశాల విద్యార్థులు, ప్రజలు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, కవాతు అనంతరం నిర్వహించే శకటాల ప్రదర్శనలు ఒక క్రమ పద్ధతిలో జరిగే విధంగా ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.అదనపు ఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు, డిఎస్పి లు రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్, ఆర్.ఐలు , శివారెడ్డి హరికష్ణ, , రమణారెడ్డి పాల్గొన్నారు.

కేరళ పాలక్కాడ్ భక్తురాలి కుటుంబానికి రూ.27 లక్షల పరిహారం

ప్రజాశక్తి - తిరుపతి సిటి



వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతిలో సర్వదర్శనం టోకెన్లు జారీలో జనవరి 8న జరిగిన తోపులాటలో మతి చెందిన కేరళ రాష్ట్రం పాలక్కాడ్ కు చెందిన వి.నిర్మల కుటుంబానికి రూ.27 లక్షల పరిహారాన్ని టిటిడి బోర్డు సభ్యులు శనివారం అందజేశారు. టిటిడి పాలక మండలి నిర్ణయం మేరకు రూ.25 లక్షలు, టిటిడి బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సొంత నిధులు రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.27 లక్షలు అందజేశారు. మతురాలి నిర్మల ఏకైక కుమార్తె కౌశిగాకు పరిహారం చెక్ ను టిటిడి బోర్డు సభ్యులు నరేష్ కుమార్, ర్రామ్మూర్తి, శాంతారాం అందజేసి పరామర్శించారు. కుటుంబంలో ఒకరైన కౌశిగాకు టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చేందుకు వివరాలను బోర్డు సభ్యుల బందం తీసుకున్నారు.

పక్షుల పండుగ..కన్నుల నిండుగ..!

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

తిరుపతి జిల్లాలో కరోనా తరువాత మొట్టమొదటిసారి అధికారికంగా నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ) అందర్నీ అలరించింది. అట్టహాసంగా ప్రారంభమై, అంగరంగ వైభవంగా ముగిసింది. జిల్లా అధికార యంత్రాంగం అంతా తామై మూడు రోజుల పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి ఉత్సవాలను నిర్వహించారు. శ్రీసిటి సహకారంతో ఆటల పాటలతో అలరించారు. జిల్లా కలెక్టర్ నుంచి కిందిస్థాయి అటెండర్ వరకు ప్రభుత్వ రెవెన్యూ యంత్రాంగం మొత్తం ఫెస్టివల్‌లో బిజీ బిజీగా గడిపారు. జిల్లా అధికార యంత్రాంగం మూడు రోజుల పాటు సూళ్లూరుపేట నియోజవర్గం మకాం వేసి విజయవంతంగా నిర్వహించడం గమనార్హం.

పక్షుల పండుగ ఫ్లెమింగ్ పెస్టివల్ –2025. ప్రకృతి, సంస్కృతి, జీవ వైవిద్యాల మహోత్సవం నినాదంతో జనవరి 18, 19, 20 తేదిలలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఐదు ప్రాంతాల్లో ఫ్లెమింగ్ పెస్టివల్ నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పండుగ వాతావరణంలో ఈ ఉత్సవాలను జరిపారు. సినీ, బుల్లితెర కళాకారుల రాక మరింత శోభతెచ్చింది. పులికాట్ సరస్సు విదేశీపక్షుల సంతానోత్పత్తికి చాలా అనువైన ప్రాంతం. ప్రతి ఏటా జనవరి నెలలో విదేశాల నుంచి సుమారు 200 రకాల పక్షులు ఈ ప్రాంతానికి చేరుకుని సంతానోత్పత్తి అనంతరం తిరిగి వాటి గమ్యస్థానాలకు వెళ్లతాయి. విదేశీ పక్షుల వీక్షణాన్ని ప్రభుత్వం ఈసారి అధికారికంగా నిర్వహించాలని తలిచింది. నాలుగు సంవత్సరాల తర్వాత తిరిగి ఫ్లెమింగ్ పెస్టివల్‌ను నిర్వహించారు. మూడు రోజుల పాటు సూళ్లూరుపేట నియోజవకర్గంలోని నేలపట్టు, బివి.పాలెం, అలకానితిప్ప, శ్రీషిటి, సూళ్లూరుపేటలో చేపట్టారు. ఈ సందర్భంగా అడ్వంచర్, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీసిటి, షార్ నుంచి స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. బివి పాలెంలో బోటింగ్ సౌకర్యం కల్పించారు. ఈ ఏడాది కొత్తగా శ్రీసిటి సహకారంతో దేశ నలుమూలల నుంచి అటవీ సంపదకు సంబంధించి తడినేలల్లో వచ్చే పక్షులను పరిశీలించే ఎన్‌జీవోలు, ఐఐటి తిరుపతి, ఐసర్, బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ, పారిశ్రామికవత్తేలను తీసుకొచ్చి ఫ్లెమింగ్ పక్షుల అభయారణ్యం, పులికాట్ పక్షుల అభయారణ్యం గురించి అవగాహన కల్పించారు. జిల్లా అధికార యంత్రాంగం మొత్తం ఆ ఐదు ప్రాంతాల్లో మకాం వేసి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆట పాటలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, సందర్శకులను ఆకట్టుకున్నారు. ఈ పండుగకు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచే కాక సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడు నుంచి కూడా పెద్ద ఎత్తున సందర్శకులు పాల్గొన్నారు. పక్షులను వీక్షించేందుకు టూరిజం శాఖ ద్వారా గైడ్లు, బైనాక్యులర్‌లను ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో సిసి కెమెరాలు, డ్రోన్లు, క్రౌడ్ మేనేజెక్మంట్ ఏర్పాటు వంటి చర్యలు తీసుకున్నారు. అధికారికంగా నిర్వహించిన ఈ పండుగలో అధికారులు, అధికార యంత్రాంగమే అధికంగా ఉండడం గమ్మత్తు. ఇంతబారీ స్తాయిలో నిర్వహించిన ఉత్సవాల వ్యయాన్ని ఇప్పటికి ప్రకటించకపోగా, జిల్లాలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడ (శ్రీసిటి)యే అన్ని తానై పాలు పంచుకోవడం గమనార్హం. ఏది ఏమైనా మూడు రోజులు పాటు పండగ వాతావరణంలో జరిగిన ఈ ఫ్లెమింగ్ పెస్టివల్‌ను ఇతరత్రా కోణాల్లో చూడకుండా, వివాదాలకు తావివ్వకుండా కేవలం విదేశీపక్షుల రాక సందర్భంగా, వాటిని వీక్షించేందుకు సందర్శకులకు సౌకర్యాల కల్పన కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంగా చూడడమే సముచితం.



ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ నాయుడుపేట మండల కమిటీ

ప్రజాశక్తి-నాయుడుపేట: ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా నాయకులు, మండలాల వారీగా నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా నాయుడుపేట మండల నూతన కమిటీ అధ్యక్షులుగా వరప్రసాద్, కార్యదర్శిగా మనోజ్, ఉపాధ్యక్షులుగా పార్థసారథి, రిషి, జగదీశ్ ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా సుమంత్, సంజయ్, పృథ్వి, ఆశోక్ కుమార్, గణేష్‌లను కమిటీ ఎన్నుకుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి శనివారం ప్రకటించారు. మండల నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నాయుడుపేట విద్యా వ్యవస్థలో అనేక లోపాలున్నాయని పట్టణంలో విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ ఏర్పాటు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల సమస్యల పరిష్కారానికి పోరాడుతామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారి కె రవీంద్రనాథ్ కలిసి శనివారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి బాగుందని రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని పిల్లల ఆహారం తాజాగా ఉండాలని ఎలాంటి లోపాలు వున్నా సహించేది లేదని తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. నాణ్యత లేని బియ్యం వస్తే వెనుకకు పంపాలని తహశీల్దారు, మండల ఎంఈవో రవీంద్రనాథ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం గోపాలకృష్ణాపురం ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన ఎస్ఎస్సి మెటీరియల్‌ను దాతలు ఇరువురం చిరంజీవి సహకారంతో విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి అభినందనలు తెలిపారు. దాత చిరంజీవి మాట్లాడుతూ పేద విద్యార్థులకు బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఉద్దేశంతో మెటీరియల్ అందించా మన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

స్కేటింగ్‌లో హిమజ విద్యార్థినికి ప్రథమ స్థానం


విద్యార్థిని అభినందిస్తున్న హిమజ సంస్థల డైరెక్టర్ రేష్మ

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : తిరుపతి శ్రీనివాస ఆర్ట్ కాలేజీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ ప్రదర్శనలో, హిమజ విద్యా సంస్థలకు చెందిన యుకేజీ విద్యార్థిని ఇ హాసిని పాల్గొని మొదటి స్థానం గెలుచుకుంది. ఈ సందర్భంగా హిమజ సంస్థ ఛైర్మన్ సురేంద్ర రాజు, హిమజ సంస్థ డైరెక్టర్ రేష్మ ధన్యవాదాలు తెలుపుతూ జాతీయ స్థాయిలోనూ ప్రథమ బహుమతి గెల్చుకోవాలని ఆ చిన్నారిని ఆశీర్వదించారు.

మార్కెట్లోకి కియా నూతన ఉత్పాదన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రముఖ కార్ల ఉత్పాదక సంస్థ కియా తన నూతన ఉత్పాదన కియా సిరోస్ కారును శనివారం చెన్నై – బెంగుళూరు జాతీయ రహదారిలోని శ్రీ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా షోరూంలో జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ముఖ్యఅతిథిగా షోరూం ఎండి సి. జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు నిరంజన్, భారతి, హేమీమారెడ్డితో కలిసి మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం ఎండి జగన్నాథ్ రెడ్డి మాట్లాడుతూ కియా సిరోస్ అత్యాధునిక సదుపాయాలను కలిగి 8 రకాల రంగుల్లో అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కస్టమర్లు, షోరూం సీనియర్ మేనేజర్ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


కారును ఆవిష్కరిస్తున్న జిల్లా రవాణా శాఖాధికారి మురళి మోహన్


28న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -సత్యవేడు: ఈ నెల 28న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజ్, సీడాప్, డిఆర్డిఏ శాఖ అధికారుల ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నారన్నారు. శ్రీసిటీకి చెందిన నాలుగు బహుళ జాతీయ కంపెనీలకు సంబంధించిన ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. ఇందుకు సంబంధించి వీల్స్ ఇండియా, బ్లూస్టార్, ముత్తూట్, ఏరియాస్ ఆగ్రో కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ డిప్లమా, బీటెక్ లేదా ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్ కార్డు జిరాక్స్ విద్యార్హత సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ బయోడేటా పాస్పోర్ట్ సైజు ఫోటోలు తప్పనిసరిగా తేవాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9440374535, 9491458910 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా ఐదో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్లను ప్రభుత్వ ఎన్టీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్య్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో విద్యారంగ సమస్యల కోసం నిరంతరం ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. వెంటనే విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కమిటీ నాయకులు సుజిత్, వెంకీ, రాహుల్, మధు, కిరణ్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండలంలోని రెప్పల పట్టు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు కుటుంబానికి చెందిన ఇల్లు శుక్రవారం రాత్రి విద్యుత్ తో కాలిపోయింది. సమాచారం అందుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ఉదయం సంఘటన స్థలానికి వెళ్లి సందర్శించి బాధితులకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. యుద్ధ ప్రాతిపదికన వారికి పక్కా గృహం మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రమేష్‌బాబు, మండల కన్వీనర్ పద్దు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఇ ఇళంగోవ రెడ్డి, ఆరణియార్ ప్రాజెక్ట్ ఛైర్మన్ డి రవి, సర్పంచ్ పద్దు రాజు, జయచంద్ర నాయుడు, శీను,గ్యాస్ వాసు, ఢిల్లీ, రమేష్, యస్ నాగరాజ్, రజిని, మణికంఠ, గవస్కర్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని రామనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం నాడు స్థానిక బిలీవ్ ఎక్సెల్ సర్వీస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శరవణ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ రామస్వామి, ఎంఈఓ రవి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యా సామగ్రిని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామస్వామి, పాఠశాల హెచ్ఎం గీత, ఉపాధ్యాయులు గురునాథం, బిలీవ్ ఎక్సెల్ సర్వీస్ ట్రస్ట్ ట్రెజరర్ కృష్ణవేణి, సభ్యులు కార్తీక్, శేఖర్, రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి- ఏర్పేడు: పెండ్లిమండ్లి లో నూతనంగా నిర్మించిన సబ్ స్టేషన్ నేడు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు ఏ ఈ వి.వాసు దేవయ్య శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ సురేంద్ర నాయుడు, ఈ ఈ వాసు రెడ్డి, ఏ డి ఈ సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు నాయకులు పాల్గొననున్నారు.

ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఓజిలి: నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను పెన్నార్ డైరెక్టర్ గంటా మధుకృష్ణ , గంటా గాయత్రి , సుబ్బారెడ్డి , వై రాంప్రసాద్ రాజు వై శ్రీదేవి శనివారం ప్రారంభించారు. మండల పరిధిలోని చిల్లమానుచేను గ్రామస్తులకు ఉచితంగా మినరల్ వాటర్ అందించాలని లక్ష్యంతో చిల్లమానుచేను గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నేత వైవి కృష్ణంరాజు జ్ఞాపకార్థం ఆయన సతీమణి సౌభాగ్యమ్మ, కుమారులు మండల వైసీపీ కన్వీనర్ యల్లంరాజు రాంప్రసాద్ రాజు, లక్ష్మణ్ రాజు, చక్రపాణి రాజు ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు.

పారిశుధ్యం జాడేది?

- అరవ కొత్తూరులో కానరాని పరిశుభ్రత - పేరుకుపోయిన చెత్త దిబ్బలు - స్పందించని అధికారులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: పల్లెటూళ్లే దేశానికి పట్టుకొమ్మలు... గ్రామంలో నివసించే ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రతి నాయకుడి దగ్గర వినబడే మాటలు... కానీ కొన్ని గ్రామాల్లో నాయకులు చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేకుండా పోతోంది. అసలు పల్లెల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించి అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి వున్నా అటు పంచాయతీ అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు కాని పట్టించుకోకపోవడం గమనార్హం.

కానరాని పారిశుధ్యం జాడ

మండలంలోని అరవ కొత్తూరు పంచాయతీ శ్రీకాళహస్తి పట్టణానికి కూతవేటు దూరంలో





వుంది. ఈ గ్రామంలో ఎక్కువ శాతం మంది రైతులు, రైతు కూలీలు నివసిస్తున్నారు. రైతులు ఎండనక.. వాననక ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే ఆ వచ్చే చాలీ చాలని డబ్బులతో వారి కుటుంబాలను పోషించుకోవడం, వారి పిల్లలను చదివించు కోవడం ఎంతో ప్రయాసతో కూడిన పని. ఇక రైతు కూలీలు అయితే రెక్కాడితే గాని డొక్కాడని వారు. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల కొంతమంది అనారోగ్యం పాలవుతుంటారు. వారి ఆరోగ్యాలను కాపాడుకోవడం కోసం ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలకు వేలు డబ్బులు ఖర్చు చేసి నష్టపోతుంటారు. ఇది ఒక రకమైన సమస్య అయితే.. గ్రామంలో పారిశుధ్య లోపం వల్ల అనారోగ్యం బారిన పడి అప్పులు చేసి మరి ఆరోగ్యం కాపాడుకోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అరవ కొత్తూరు పంచాయతీలో ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త చెదారం పోయడం వల్ల అటువైపుగా వెళుతున్న గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ సచివాలయ ఆవరణలోనే చెత్త పోసి ఉంటే దాన్ని శుభ్రం చేయించే పరిస్థితుల్లో అక్కడి అధికారులు లేరంటే మరి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పోసిన చెత్తను ఎప్పటికి శుభ్రం చేయిస్తారో అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

స్పందించని డిడివో

పారిశుధ్య లోపం విషయమై గ్రామ సచివాలయ డిడివో శ్రీనివాసులును వివరణ కోరేందుకు ఫోను ద్వారా ప్రయత్నించగా స్పందించకపోవడం గమనార్హం.

పారిశుధ్య లోపం మా దృష్టికి రాలేదు

పారిశుధ్య లోపం విషయమై ఈవోపిఆర్‌డిని ప్రశ్నించగా అరవ కొత్తూరు గ్రామంలో పారిశుధ్య లోపం సమస్య ఉన్న విషయం మా దృష్టికి రాలేదు..వెంటనే సంబంధిత అధికారులకు తెలిపి గ్రామంలో పారిశుధ్య లోపం లేకుండా చూస్తాం..
-పద్మజ, ఈవోపిఆర్‌డి.

ప్రభుత్వ డాక్టరు రూప సేవలు భేష్

ఎక్స్‌రే మిషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రశంస

ప్రజాశక్తి -కోట : కోట ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూప ఆస్పత్రి అభివృద్ధికి, రోగులకు అందిస్తున్న సేవలు భేష్ అని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ప్రశంసించారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే మిషన్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కోట ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూప ఆసుపత్రిలో చేస్తున్న సేవలను స్థానిక టిడిపి నాయకులు, మాజీ ఎన్‌డిసిసి ఛైర్మన్ నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, జనసేన నాయకులు బాలసుబ్రహ్మణ్యం, పలువురు స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. తక్షణమే ఎమ్మెల్యే సునీల్ కుమార్ స్పందించి ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్ర కమిటీ సమావేశంలో డాక్టర్ రూపను అభినందించారు. అంతే కాకుండా మాజీ ఎన్‌డిసిసి ఛైర్మన్ నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్‌లు మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూప ఆసుపత్రిలో జాయిన్ అయినప్పటి నుండి రోగుల వైద్యం, ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమా లు, మహిళల కాన్పుల విషయంలో, రోగులకు చికిత్స చేసే సమయంలో వారితో ఆప్యాయతగా మాట్లా డడం లాంటి తదితర విషయాల్లో చురుకుగా ఉండడంతో ఒక్కసారిగా కోట ప్రభుత్వ ఆస్పత్రికి మంచి పేరు వచ్చిందన్నారు. మిగతా డాక్టర్లు కూడా అందుబాటులో ఉండి రోగులకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా సరైన చికిత్సలు అందిస్తున్నారన్నారు. డాక్టర్ రూప మాట్లాడుతూ ఎవరైనా మృతి చెందిన వారికి పోస్టుమార్టం నిర్వహించడానికి నూతన భవనం అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఫ్రీజర్ కూడా అవసరమని తెలిపారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పోస్ట్ మార్టం కోసం నూతన భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తన తండ్రి పాశం పెంచలయ్య పేరుపై ఆస్పత్రికి ఫ్రీజర్ ను అందిస్తామని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోడ్డులో వీధిలైట్లు, తదితర లాంటి అభివృద్ధి కార్యక్రమాలు అవసరమని ఎమ్మెల్యేకు డాక్టర్ రూప తెలిపారు. కోట ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్న డాక్టర్ రూపకు అక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరూ అభినందనలు తెలిపారు.


ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి: సిపిఎం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఫిబ్రవరి 1,2,3వ తేదీల్లో నెల్లూరులో నిర్వహిస్తున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గూడూరు సిపిఎం ఆర్గనైజర్ జోగి శివ కుమార్ పేర్కొన్నారు. గూడూరు సిపిఎం కార్యాలయంలో సిపిఎం మహాసభల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగి శివ కుమార్ మట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం ప్రజా సమస్యల మీద పోరాటాలు నిర్వహించే సిపిఎం ఇప్పటికే మండల, పట్టణ, జిల్లా మహాసభలు పూర్తి చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలు గుర్తిం చిందన్నారు. నెల్లూరు రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలో నిర్వహించే పోరాటలకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. విశాఖ స్టీల్‌కు సొంత గనులు ఇవ్వాలని, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని, ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని, కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లాలను సమగ్రాభివృద్ధి చేయాలని సిపిఎం మహాసభ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసులు , సురేష్ , గుర్రం రమణ య్య, ముత్యాలయ్య, చంద్రయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.


గూడూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

నాయుడుపేట: నాయుడుపేటలోని వెదనపర్తి సుందర్ రామిరెడ్డి సిఐటియు కార్యాలయంలో శనివారం సాయంత్రం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. నెల్లూరు నగరం వేదికగా ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరిగే సీపీఎం రాష్ట్ర 27 మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల కార్యదర్శి సంగం మహేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో రాష్ట్ర మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు భారీ ర్యాలీ అనంతరం నిర్వహించే సభకు సిపిఎం ఆల్ ఇండియా పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ, బీవీ రాఘవులు, బృందాకారత్ హాజరవుతారని తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్నా ప్రజా వ్యతిరేక పాలన, విధానాలపై చర్చించి భవిష్యత్తు ప్రజా పోరాటాలను రూపొందించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్ర మహా సభలకు కార్యకర్తలు, సానుభూతి పరులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, ఏరియా నాయకులు శివ కవి, ముకుంద, వీరాస్వామి, విజయమ్మ, ఎన్ శ్యామలమ్మ పాల్గొన్నారు.

ఎం గంగులప్పకు డాక్టరేట్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రఖ్యాత విశ్వవిద్యాలయం భారత వర్చువల్ యూనివర్సిటీ బెంగుళూరులో సుప్రీం కోర్టు న్యాయమూర్తి చేతుల మీదుగా తిరుపతికి చెందిన అన్నమాచార్య కళాకారుడు ఎం గంగులప్ప డాక్టరేట్ ను అందుకున్నారు. నిరంతరం సేవాభావం కలిగిన వ్యక్తి గంగులప్ప. కళాకారుల అభ్యున్నతికోసం ఎంతగానో కృషి చేస్తూనే వుంటారు. అప్పుడప్పుడూ24 గంటలు నిర్విరామంగా అన్నమయ్య అఖండ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించడం, హరికథాఉత్సవాలు జరిపిస్తూ సినీ నేపథ్య గాయకులు ఎస్పి బాలసుబ్రహ్మణ్యం ని ఆహ్వానించి వారి చేతులమీదుగా వందలాదిమంది కళాకారులను ఘనంగా సన్మానిస్తూ దేశం నాలుమూలలా తిరిగి అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తూ కళామాతల్లి సేవలో తరిస్తున్న గంగులప్ప కి గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు కె చంద్రశేఖర్ భాగవతార్, టీ మురళి జి నటరాజ ఎం రెడ్డెప్ప, పున్నమరాజు, మురళీకృష్ణ, కె సుబ్రహ్మణ్యం అభినందనలు తెలిపారు.


గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడు గంగులప్ప

జర్నలిస్ట్ ప్రకాష్ బాబుకు ..

తిరుపతి సిటీ: జర్నలిజం, సామాజిక సేవలో అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ సౌపాటి ప్రకాష్ బాబుకు భారత్ వర్చ్యువల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. శనివారం కర్ణాటక బెంగళూరులో యూనివర్సిటీ కాన్వకేషన్ నిర్వహించారు. వర్సిటీ ఛైర్మన్ డాక్టర్ తంగవేలు, డీన్ డాక్టర్ స్వామి చేతుల మీదుగా ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రకాష్ బాబు అందుకున్నారు. తిరుపతిలో రెండు దశాబ్దాలుగా జర్నలిజం రంగంలో ప్రకాష్ విశేష సేవలు అందిస్తున్నారు. సమాజాన్ని చైతన్య పరిచేలా తన వార్తా కథనాల ద్వారా కృషి చేశారు. 'అమ్మకు దుర్గతి' అంటూ రాసిన కథనాలు టీటీడీలో సంచలనంగా మారాయి. తరువాత దాదాపు రూ.15 కోట్లకు పైగా నిధులతో పేరూరు బండ పైన వకుళమాత ఆలయం జీర్ణోదారణ చేయడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ మీడియా స్పోర్ట్స్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా, డెమోక్రటిక్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ పనిచేస్తున్నారు. ప్రతిష్టాత్మక తిరుపతి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా జర్నలిస్టులకు సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ అందుకున్న ప్రకాష్ మాట్లాడుతూ ఈ అవార్డు మెరుగైన సమాజం కోసం పగలనక రాత్రి అనక కష్టపడుతున్న జర్నలిస్టులందరికీ దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. అవార్డు స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

డాక్టర్ ఎం నిరంజన్ బాబుకి ఘన సన్మానం

ప్రజాశక్తి -రామచంద్రపురం: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు, సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబును కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. శనివారం వెంకట్రామాపురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల నందు డాక్టర్ ఎన్ నిరంజన్ బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. సందర్భంగా కళాశాల ప్రాంగణంలో బారీ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కళాశాల సిబ్బంది డాక్టర్ ఎం నిరంజన్ బాబును దృశ్యాలువతో, సన్మానించి పుష్ప గుచ్చాలను అందజేసి అభినందనలు, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిం చారు. రేణిగుంట అభయ క్షేత్రంలో ప్రత్యేక ప్రతిభావంతులకు స్వీట్లు పండ్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా పద్మావతి విద్యాలయం వార్షికోత్సవం

ప్రజాశక్తి- తడ:

తడ మండలం లోని పులివేంద్ర గ్రామంలో వున్న పద్మావతి విద్యాలయం వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా మేనేజింగ్ ట్రస్టి పి యల్ లక్ష్మీ నారాయణ, ఆయన సతీమణి జయశ్రీ, ఆర్ మోహన్ విచ్చేశారు. అతిథులకు విద్యాలయ కరస్పాండెంట్ వరలక్ష్మీ,ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ పాండ సాదర స్వాగతం పలికారు. విద్యార్థివిద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుని అలరించాయి. అనంతరం అతిథుల చేతుల మీదుగా ఆట పోటీలలో, సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థుల విజేతలకు బహుమతులను అందజేశారు. పి ఈ టి కే.తనూష్ ఏ ఓ వెంకటేశ్వర్లు యాదవ్, కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ నరసింహమూర్తి శనివారం తెలిపారు. ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో గల ప్రైవేటు దుకాణాల యజమానులతో మాట్లాడి రోడ్డు కనబడే విధంగా సీసీ కెమెరాల దిశ మార్చామన్నారు. ఇలా చేయడం వలన బస్టాండు పరిసరాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ గోపి, పోలీసులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చిరువ్యాపారిపై హత్యాయత్నం

ఆర్థిక లావాదేవీలే కారణమంటున్న బంధువులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమలలో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్న బోయన బాబు అనే వ్యక్తిపై శుక్రవారం రాత్రి కరకంబాడి మార్గంలోని అన్నమయ్య నగర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారని, మధ్యవర్తిగా ఉండి తిరుమలలో హోటల్ నిర్వహించుకుంటున్న వ్యక్తికి రూ.30 లక్షల రూపాయలు ఇప్పించారని, నగదు చెల్లించాలని అడగడంతోనే కిరాయి హంతకులతో ఇంతటి దారుణానికి పాల్పడ్డారని బంధువులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి నగర పరిధిలోని స్థానిక అన్నమయ్య నగర్‌కు చెందిన బోయన బాబు స్నేహితుడు నుండి తిరుమల పద్మావతి అతిథి నిలయంలో అసిస్టెంట్ షరాబుగా పనిచేస్తున్న కొనిశెట్టి రాము సోదరుడు కొనిశెట్టి ప్రవీణ్ నిర్వహిస్తున్న హోటల్ అభివృద్ధి కోసం రూ.30 లక్షల రూపాయలు రుణంగా తీసుకున్నారని, నగదును తిరిగి చెల్లించాలని కోరడంలో చోటుచేసుకున్న వివాదంతో కిరాయి హంతకులతో బోయన బాబును హతమార్చడానికి కుట్ర చేశారని ఆరోపించారు. బోయిన బాబుపై కిరాయి హంతకులు చేసిన దాడిలో తలకు, కుడి చేతికి తీవ్ర గాయాలు అయ్యాయని, ప్రస్తుతం ఆయన రూయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఇంతటి దురాగతానికి తెగించిన వారిపై, హత్య చేయడానికి వచ్చిన వ్యక్తులపై కఠిన చర్యలు పోలీసు శాఖ తీసుకోవాలని ఈ సందర్భంగా బోయన బాబు బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి- రామచంద్రపురం (చంద్రగిరి) : చంద్రగిరి కొత్తపేట బ్రాహ్మణ వీధిలో శుక్రవారం రాత్రి భారీ చోరీ చోటు చేసుకుంది. ఇంటి యజమాని అప్పయ్య శాస్త్రి తన కుటుంబ సభ్యులతో 17వ తేదీ అన్నవరం దైవ దర్శనానికి వెళ్లారు. దైవ దర్శనానంతరం శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులకి వేసిన తాళాలు పగలగొట్టి వున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులోని కబోర్డ్స్ బీరువాలలోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ ఇంటి లోపల బీరువా లాకర్లలో ఉంచిన సుమారు 40 గ్రాముల బరువు గల బంగారు ఆభరణాలు దొంగ తనానికి గురైనట్లు అప్పయ్య శాస్త్రి గుర్తించాడు. ఎస్ఐ రవీంద్ర నాయక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం అప్పయ్య శాస్త్రి, గ్రౌండ్ ఫ్లోర్ మొదట అంతస్థును క్షుణ్ణంగా పరిశీలించింది. అప్పయ్య శాస్త్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని తడుకు గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... నారాయణవనం మండలం సముదాయం గ్రామానికి చెందిన. వ్యక్తి గుర్తించారు రాము(37) తిరుమల మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గుర్తుతెలియనని వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. స్థానికుల పోలీసులకు సమాచారం అందించగా వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి 108 సాయంతో పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాముకి ఓ కుమారుడు, కుమార్తె వున్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

వివాహేతర సంబంధాలే కారణం?

ప్రజాశక్తి - పిచ్చాటూరు: భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన శనివారం పిచ్చాటూరు మండలంలోని కీలాపూడి పంచాయతీ గజసింగ రాజు పురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై వెంకటేష్ కథనం మేరకు..మృతుడు ఆంటోనీ (33) భార్య సుగంధి విజయపురం మండలం ఇరుగువాయి చెందన ఆరుల్ రాజు మధ్య వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడు అని పథకం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి ప్రియుడు ఆరుల్ రాజ్ తో కలసి మృతుడు భార్య సుగంధి నిద్రపోతున్న భర్త మెడలో తాడుకట్టి బిగించి హత్యకు పాల్పడ్డారని ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. కేసు దర్యాప్తులో హత్యకు గల కారణాలు పూర్తి స్థాయిలో తెలియాల్సి వుందన్నారు. మృతుడు ఇద్దరు కూతుర్లు , ఒక కొడుకు ఉన్నారు. క్షణిక ఆవేశంతో తీసుకున్న నిర్ణయంతో పిల్లలు రోడ్డున పడ్డారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దర్శన టోకెన్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలోని శ్రీనివాసం , భూదేవి కాంప్లెక్స్, విష్ణు నివాసంలో శ్రీవారి దర్శన టిక్కెట్లు జారీ చేసే ప్రాంతాన్ని ఎస్పీ హర్షవర్ధన్ రాజు శనివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తిరుపతి, తిరుమలకు వస్తున్న భక్తులను దృష్టిలో పెట్టుకుని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. క్యూ లైన్ లో ఏర్పాట్లు ఎలా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకుని క్యూ లైన్ పై పలు సూచనలు చేశారు. తిరుపతికి, తిరుమలకు, వస్తున్న భక్తులను అంచనా వేస్తూ... ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని ఆదేశించారు. భక్తుల ద్విచక్ర వాహనాలు, కార్లకు సంబంధించిన పార్కింగ్ ఎర్పాటు చేసే విధానాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎంతో భక్తి, శ్రద్ధలతో వస్తున్న భక్తులపట్ల సిబ్బంది అమర్యాదగా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. భక్తులు పట్ల సిబ్బంది ప్రవర్తన పోలీసుల పట్ల గౌరవం పెంచే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ పి కే రవి మనోహరాచారి, ట్రాఫిక్ డిఎస్పి రామకృష్ణ ఆచారి, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి శ్రీలత, పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి -కోట : కోట మండలం శ్యామసుందర పురంలో అంగన్‌వాడీ పాఠశాలలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని కోటమ్మ తల్లి ఆలయ ఛైర్మన్, టిడిపి నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శ్యాంసుందర పురంలోని అంగన్‌శాడీ విద్యార్థులకు శ్రీ షిరిడి సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో వాకాడు కు చెందిన నజీర్ బాష దాతృత్వంతో దుస్తులు అందించారు. ఈ మేరకు ఐసిడిఎస్ కోట ప్రాజెక్టు అధికారిణి ముని కుమారి, శ్రీషిరిడి సాయి అక్షయ సేవాసమితి అధ్యక్షులు అల్లం రమణయ్య,నల్లపరెడ్డి.జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా రవి నగర్, ఎస్ఎల్‌జి కాలనీ,కే.ఎన్ ఎస్ టీ కాలనీ,శ్యామసుందర పురంలోని రెండు అంగన్వాడీ పాఠశాలలోని సుమారు వందమంది విద్యార్థులకు ఆయా దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య,సుబ్రహ్మణ్యం రెడ్డి శరవన్, నందం మోహన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఐ కృష్ణమ్మ, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, మమత, పెంచలమ్మ, సుప్రజ, మస్తానమ్మ పాల్గొన్నారు.

ఎస్వీయూకు రూ.40 లక్షల భూరి విరాళం



ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మాజీ విద్యార్థి, హైదరాబాద్ కు చెందిన జీఆర్ పవర్ స్విచ్ గేర్ సంస్థ అధిపతి సి గోపాల్ రెడ్డి 40 లక్షలతో ఎస్వీయు ఇంజనీరింగ్ విద్యార్థినులకు హాస్టల్ సముదాయంలో వంటశాల, భోజనశాలను నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వర్సిటీ ఇన్‌ఛార్జీ ఉప కులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడులు దాత గోపాల్ రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఆచార్య కేయం భాను, హాస్టల్ వార్డెన్ ఆచార్య గౌరీ శంకర్ రెడ్డి, ఆచార్య పి.హేమ వర్సిటీ ఇంజనీర్ తాండవ కృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE: TIRUPATI
I.A.No. 04/2024, O.S.No. 58/2024

T.Malleswari ...Petitioner/Plaintiff
Vs
Sri Jampala Srinivasa Rao & anothers ...Respondents/Defendants

SUMMONS TO RESPONDENTS/ DEFENDANTS No.1 & 2

R1/D1) Sri. Jampala Srinivasa Rao @ Yoga Srinivas, S/o Not known, Cell NO. 9490108303.
R2/D2) Sri Jampala Ganesh Ranadhir, S/o J. Srinivasa Rao, Cell NO. 9491542378.
Both are residing at Flat No. 203.2nd Floor, Srinivasa Residency, Padmavathi Nagar West, Near Munireddy Nagar Arch, Tirupati, Tirupati District.

Please take notice that the petitioner/ plaintiff filed the above petition/suit for recovery of money against you and the same is posted for your appearance. So, you are hereby called upon to appear before the Hon'ble Court on 06-02-2025 at 10.30 a.m., failing which the matter will be decided exparte.

Hearing Date: 06-02-2025.
//'by order of court//
VELLORE BHASKAR
Advocate for Plaintiff, Tirupati

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) SRIKALAHASTHI
I.A. No.824 of 2023
O.S. No. 148 of 2023

M. Savithramma ...Petitioner/Plaintiff
Vs
R. Mani and 5 Others ...Respondents/Defendants

NOTICE TO THE RESPONDENTS/DEFENDANTS.No. 1 TO 3

1. R. Mani S/o. B. Rajumandadi, Pallipattu Village, Pallipattu Taluk, Tiruvallur District. Tamil Nadu.
2. E. Hari S/o E. Munirathnam, Door No. 6-29. Venganna Kandriga Village. Mudipalli Post. PIN 517 592, Chittoor District.
3. K. Jayamma W/o. K. Sriramulu. Door No. 6-29, Venganna Kandriga Village. Mudipalli Post. PIN 517 592. Chittoor District.

Sirs/Madam.

Please take Notice that the above Case stands posted to 7-2-2025 for your appearance. Do appear and file your Objections at 10.30 A.M. in the above mentioned Court, else, the matter will be decided ex-parte.

Date of hearing: 7-2-2025
N. Venkatramana Reddy
V.K.M. Pragnasree
Advocates

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) SRIKALAHASTHI
O.S. No. 148 of 2023

M. Savithramma ...Plaintiff
Vs
R. Mani and 5 Others ...Defendants

SUIT SUMMONS TO THE DEFENDANT Nos. 1 TO 3

1. R. Mani S/o. B. Rajumandadi, Pallipattu Village, Pallipattu Taluk, Tiruvallur District. Tamil Nadu.
2. E. Hari S/o E. Munirathnam, Door No. 6-29. Venganna Kandriga Village. Mudipalli Post. PIN 517 592, Chittoor District.
3. K. Jayamma W/o. K. Sriramulu. Door No. 6-29, Venganna Kandriga Village. Mudipalli Post. PIN 517 592. Chittoor District.

Sirs/Madam.

Please take Notice that the above Case stands posted to 7-2-2025 for your appearance. Do appear and file your Objections at 10.30, A.M. in the above mentioned Court, else, the matter will be decided ex-parte.

Date of hearing: 7-2-2025
N. Venkatramana Reddy
V.K.M. Pragnasree
Advocates